అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన అభిమానులు

జగ్గయ్యపేట: విజయవాడలో శుక్రవారం నిర్వహించిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణకు జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి అంబేడ్కర్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. చిల్లకల్లు, పోచంపల్లి, అనుమంచిపల్లి, కె.అగ్రహారం, గండ్రాయి, మల్కాపురం, జయంతిపురం, వేదాద్రి తదితర గ్రామాల నుంచి విజయవాడకు బయలుదేరిన బస్సులను ఆయా గ్రామాల సర్పంచులు జెండాఊపి ప్రారంభించారు. విగ్రహావిష్కరణకు తరలివెళ్లిన వారిలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, సర్పంచులు కొత్తపల్లి లూర్దుమేరి, గుడారి పేరయ్య, బాల్యానాయక్ తదితరులు ఉన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలానికి చెందిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి అంబేడ్కర్ అభిమానులు, నాయకులు భారీసంఖ్యలో తరలివెళ్లారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని నాయకులు కొనియాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పాలన దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. విజయవాడకు తరలివెళ్లినవారిలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, పార్టీ సీనియర్ నాయకుడు వేల్పుల రవికుమార్, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, జిల్లా ఎస్సీ నాయకులు గుజ్జర్లపూడి వడ్డీకాసులు, జంగం కాలేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, అంబేడ్కర్ అభిమానులు ఉన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వత్సవాయి మండలం నుంచి ప్రజలు భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, ఎంపీపీ కొలుసు రమాదేవి, వైస్ ఎంపీపీ కాలికపోగు వెంకటేశ్వర్లు, సర్పంచి భూక్యా సీతమ్మ, మక్కపేట నుంచి సర్పంచి గుడేటి శారమ్మ, కనగాల రమేష్, చిట్టేల నుంచి మార్నెళ్ల పుల్లారెడ్డి సోదరులు, పోలంపల్లి నుంచి కాటేపల్లి రవి, భీమవరం నుంచి చింతకుంట్ల వెంకటరెడ్డి, మంగొల్లు అన్నెపాక నరసింహరావు, సామినేని లక్ష్మీనారాయణతోపాటు వందలాది మంది అంబేడ్కర్ అభిమానులు కార్యక్రమానికి తరలివెళ్లారు. నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుతోపాటు ఆయన గొప్పతనాన్ని భవిష్యత్‌తరాలకు తెలియజేసేలా స్మృతివనాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడలోని స్వరాజ్ మైదానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగిన సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు జగ్గయ్యపేట పట్టణం నుంచి అంబేడ్కర్ అభిమానులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివెళ్లారు. అంబేడ్కర్‌ను స్మరించుకోవడం అందరి బాధ్యత అంటూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఇచ్చిన పిలుపు మేరకు అభిమానులు భారీగా తరలివెళ్లి బీఆర్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

నందిగామ మండలంలో...

నందిగామ: విజయవాడలో శుక్రవారం జరిగిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాష్కరణకు నందిగామ నియోజకవర్గం నుంచి వేలాది మంది అంబేడ్కర్ అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. నందిగామ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి అంబేడ్కర్ అభిమానులు భారీగా తరలివెళ్లారు. నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తోపాటు నియోజకవర్గం నుంచి దాదాపు 150కి పైగా వాహనాల్లో వేలాది మంది తరలివెళ్లారు.


విజయవాడకు తరలివెళ్తున్న పోచంపల్లి గ్రామస్తులు


విగ్రహావిష్కరణకు బయలుదేరిన వెంకటాపురం, పొన్నవరం వాసులు


పెనుగంచిప్రోలు నుంచి తరలిన నాయకులు, అంబేడ్కర్ అభిమానులు


విగ్రహావిష్కరణకు వెళ్తున్న అనుమంచిపల్లి నాయకులు, గ్రామస్తులు


జగ్గయ్యపేట నుంచి బయలుదేరిన తుమ్మల ప్రభాకర్, యువకులు


బలుసుపాడు నుంచి తరలివెళ్తున్న అంబేడ్కర్ అభిమానులు


విగ్రహావిష్కరణకు బయలుదేరిన వత్సవాయి మండల నాయకులు, ప్రజలు


నందిగామ డీవీఆర్ కాలనీ నుంచి తరలివెళ్తున్న స్థానికులు


చందర్లపాడు నుంచి తరలివెళ్తున్న అంబేడ్కర్ అభిమానులు


విగ్రహావిష్కరణకు విజయవాడ తరలిన అనిగండ్లపాడు గ్రామస్తులు

క్లుప్తంగా

నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నందిగామ: పట్టణ పరిధిలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఈకార్యక్రమానికి అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు సొసైటీ భవనం ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కోదాడ రోడ్డులో సర్దార్ సామినేని విశ్వనాథం పేరుతో రూ.2.45కోట్లతో నూతనంగా నిర్మించిన ది జగ్గయ్యపేట గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సంఘం భవనం, షాపింగ్ కాంప్లెక్స్‌ను శనివారం ఉదయం పదిగంటలకు ప్రారంభించనున్నారు.కార్యక్రమానికి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ముఖ్యఅతిథులుగా హాజరై సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారని గోపాలకృష్ణ సొసైటీ ప్రెసిడెంట్ కోలపల్లి వెంకటేశ్వరరావు(బుల్లిబాబు) శుక్రవారం తెలిపారు. సొసైటీ సభ్యులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు



కంచికచర్ల(వీరులపాడు): స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం యోగి వేమన జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలలోని నీతి ఈతరం వారు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాహిత్య రంగానికి వేమన చేసిన సేవలకు గుర్తుగా రాష్ట్రప్రభుత్వం గతేడాది నుంచి యోగి వేమన జయంతిని నిర్వహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో బి.డి.సి నిర్వాహకులు ఆవల పేరయ్య, వుయ్యూరు శ్రీనివాసరావు, పాఠకులు పాల్గొన్నారు.

రేపు విశ్వనాథ భాగవతార్ జయంతి

విజయవాడ కల్చరల్: హరికథ రాజహంస, కళాప్రపూర్ణ డాక్టర్ అమ్ముల విశ్వనాథ భాగవతార్ జయంతి సభను ఈ నెల 21వ తేది ఆదివారం సాయంత్రం దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అమ్ముల ప్రసాద్, బీవీ దుర్గాభవానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి తరం వారికి హరికథ విశిష్టతను తెలియజేయడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే హరికథా భాగవతారిణి వెగలిచర్ల నాగమణికి విశ్వనాథ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సభలో నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు, సంగీత విద్వాంసులు పాల్గొంటారని వివరించారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కంచర్ల



తిరువూరు: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరువూరుకు చెందిన సీనియర్ న్యాయవాది కంచర్ల ముత్యప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ నియామక ఉత్తర్వులను శుక్రవారం జంగారెడ్డిగూడెంలోని రాష్ట్ర కార్యాలయంలో ముత్యప్రసాద్‌కు అందజేశారు. తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సోమవరపు సత్యనారాయణ, సంఘ నాయకులు ముత్తారావు, బొడ్డు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పాలడుగు వెంకట్రావుకు నివాళి

మునుసూరు: ధైర్యసాహసాలు, ఉక్కు సంకల్పంతో జమిందారీ వ్యవస్థకు ఎదురొడ్డి పేద ప్రజల కోసం భూ పోరాటాలు చేసిన నీతివంతమైన రాజకీయ నేత పాలడుగు వెంకట్రావు జీవితం ఆదర్శమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వలసపల్లి రామచంద్ర ప్రసాద్ (రాముడు) అన్నారు. వెంకటరావు 9వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని గుళ్లపూడిలో పాలడుగు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ ఆర్. శ్రీదేవి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వేంపాటి వల్లీ పద్మజ రాంబాబు, మాజీ సర్పంచ్ ఊరకరణం వల్లీ శాంతకుమారి, సీనియర్ నేతలు కూరపాటి శోభనాద్రి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల (వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండలంలోని గండేపల్లిలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి ఆయా ప్రభుత్వ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గడపగడపకు మనప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలను నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. గడపగడపకు మనప్రభుత్వం సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు కేటాయించారని వివరించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్న విధానంపై వారిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచి బొక్కా రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు పిల్లి భాగ్యలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు మట్ట శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచి బెల్లంకొండ సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.


గండేపల్లివాసులకు సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

గ్రామగ్రామాన కులగణన సర్వే


వెంకటాపురంలో బయోమెట్రిక్ తీసుకుంటున్న సచివాలయ సిబ్బంది


ముండ్లపాడులో బయోమెట్రిక్ తీసుకుంటున్న సచివాలయ అధికారి, వలంటీర్

జగ్గయ్యపేట: కులగణన సర్వే జగ్గయ్యపేట నియోజకవర్గంలోని గ్రామగ్రామాన శుక్రవారం చేపట్టారు. గ్రామ సచివాలయంలోని సిబ్బంది ఇంటింటికి వెళ్లి వారి కుల వివరాలను సేకరించి ప్రభుత్వ ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేశారు. సర్వే ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్ బాబు మాట్లాడుతూ ఈనెల 27 వరకు కులగణన సర్వే జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. సాంకేతికపరమైన ఇబ్బందుల కారణంగా ఉదయం పూట కొద్దిసేపు ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదుకు అవాంతరం ఏర్పడినప్పటికీ అనంతరం యాప్ సజావుగా పనిచేయడంతో కులగణన సిబ్బంది సర్వేను సజావుగా నిర్వహించారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. పూర్తి గోప్యతతో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఎంతమంది నివాసం ఉంటున్నారు..కుల వివరాలను తెలుసుకుంటున్నారు. వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. బయోమెట్రిక్ ద్వారా కుటుంబ పెద్ద అథెంటికేషన్ తీసుకుంటున్నారు.

అలరించిన రామభక్తి సామ్రాజ్య కృతిగానం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన అయోధ్య రామ మందిరం స్థాపన సందర్భంగా సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రామభక్తి సామ్రాజ్య కృతి గానం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. వాగ్గేయకారులు రామదాసు, త్యాగరాజస్వామి, అన్నమయ్య, స్వాతి తిరునాళ్ రచించిన శ్రీ రామచంద్ర ప్రభువు కీర్తనలను మధురంగా గానం చేశారు. శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి కళాశాల బాలబాలికలు వీణపైన, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, వేమూరి విశ్వనాథ్, విష్ణుమూర్తి సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. కార్తికేయ ఆదినారాయణ, జగన్మోహిని వాద్య సహకారం అందించారు. కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి చిట్టా విశ్వేశ్వరరావు, రామలక్ష్మి నిర్వహించారు.


సంప్రదాయ కీర్తనలను వీణపై పలికిస్తున్న చిన్నారులు

నిమ్రా ఫార్మసీ కళాశాలకు యూజీసీ గుర్తింపు

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఫార్మసీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపు లభించిందని కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి. నారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006లో నిమ్రా యాజమాన్యం ప్రారంభించిన కళాశాల దినదినాభివృద్ధి చెంది నేడు విద్యార్థులకు ఫార్మసీ, ఫార్మా డి, డి ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్య అందిస్తోందని తెలిపారు. ఈ కోర్సులన్నిటికీ యూజీసీ 2ఎఫ్ గుర్తింపు లభించిందన్నారు. గత అక్టోబర్‌లో న్యాక్ బృందం పర్యటించి ఏ గ్రేడ్ గుర్తింపు ప్రకటించిందని వివరించారు.

జ్యూయలరీ ఎక్స్‌పో ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): యునైటెడ్ ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీలోని ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో యూఇ ది జ్యూయలరీ ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనను ఇన్నర్‌వీల్ క్లబ్ మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ హరితా చౌదరి, ఇన్నర్ వీల్ క్లబ్ విజయవాడ ప్రెసిడెంట్ వి. సరోజలతో కలిసి నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముంబయి, న్యూ ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కత్తా, చెన్నై, జైపూర్, హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు చెందిన జ్యూయలరీ వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వికే మనోజ్ తెలిపారు. ప్రదర్శనలోని గాజులు, ఉంగరాలు, నెక్లెస్లు, ఇయర్ రింగ్స్, పెండెంట్స్, బ్రైడైల్ కలెక్షన్స్, మెన్స్ కలెక్షన్స్, చైన్స్, ఇతర ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఒక అద్భుత అవకాశమని పేర్కొన్నారు.

సామాజిక సేవలో వ్యవసాయ విద్యార్థులు

పోచంపల్లి (జగ్గయ్యపేట): విద్యార్థులు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కృష్ణంరాజు సూచించారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పోచంపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ క్యాంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు వారం రోజులపాటు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలు, తీసుకుంటున్న జాగ్రత్తలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటారన్నారు. అంతేకాకుండా విద్యార్థులు గ్రామాల్లో పర్యటన చేసి పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం రైతులతో కలసి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచి బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు పెదవెల్లి పరమేశ్వరరావు, శాస్త్రవేత్తలు విశ్వజారాజ్, విజయప్రకాష్, బాలమురళీధరన్, వెంకటరెడ్డి,పాల్గొన్నారు.


పాఠశాలలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నందిగామ: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం.. పట్టణ శివారు అనాసాగరం గ్రామానికి చెందిన కొనగాల కొండ (68) ఈనెల 16వ తేదీన అనాసాగరంలోని ఇంటివద్ద నుంచి గ్రామంలోని సెంటర్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా 65వ నంబర్ జాతీయ రహదారిపై నందిగామ వైపు నుంచి జగ్గయ్యపేట వైపు వెళ్తున్న ఓ బైకు ఆయన్ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన ఆయనను చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన గురువారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు వివరించారు.

జాతికి స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

విజయవాడ కల్చరల్: భారత జాతికి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వరాజ్య మైదానంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ విగ్రహం ప్రారంభం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రభుత్వ అభినందన కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం గర్వించేలా అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి కోట్లాది మంది అభిమానుల కోరికను నెరవేర్చిన ప్రభుత్వ కృషిని అభినందించారు. అలాగే కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వారికి గుర్తింపు కార్డులను కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గాయనీ గాయకులు సుధారాణి, రేష్మ, షబానా, బీహెచ్ కామేశ్వరి, శ్రావణి, ఆదిరాల జయప్రభ తదితరులు దేశభక్తి గీతాలను ఆలపించారు. అంబేడ్కర్ స్మృతిగీత బృందగానం ఆకట్టుకుంది. కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, న్యాయవాది చీదెళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ స్మృతిగీతం ఆలపిస్తున్న గాయనీ గాయకులు

మండల స్థాయి వాలీబాల్ విజేత చిత్తపూరు 2 జట్టు

చాట్రాయి: మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం బాలబాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో వాలీబాల్ విన్నర్‌గా మర్లపాలెం, కబడ్డీ చనుబండ, ఖోఖో కోటపాడు మండల విన్నర్‌గా నిలిచాయి. అలాగే బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్ చిత్తపూరు 2, ఖోఖోలో కోటపాడు జట్లు విన్నర్‌గా నిలిచాయి. ఈ పోటీల్లో సతీష్, ప్రభాకర్, విజయ్‌లు ఎంపైర్లగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

● విస్సన్నపేట: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయని ఎంపీ డీఓ ఎస్. వెంకటరమణ అన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. తాతకుంట్ల టీం మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైందని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కె. సురేష్, పంచాయతీ కార్యదర్శి రామారావు, ఆదినారాయణ, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఏ.కొండూరు: మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్ క్రికెట్ పోటీల్లో పోలిశెట్టిపాడు, ఏ.కొండూరు, కోడూరు, కుమ్మరికుంట్ల గ్రామాల జట్లు తలపడ్డాయి. కోడూరు, ఏ.కొండూరు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ రెండు జట్లు ఫైనల్‌లో తలపడతాయని ఎంపీడీఓ రవికాంత్ తెలిపారు.



● ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈదర, ఆగిరిపల్లి సచివాలయాల జట్ల మధ్య జరిగిన మండల స్థాయి మహిళల ఫైనల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆగిరిపల్లి జట్టు విజేతగా నిలిచింది. మండలంలో శుక్రవారం 54 క్రీడా పోటీలు నిర్వహించామని ఈవోపీఆర్డీ శేఖర్ తెలిపారు.

● ముసునూరు: ముసునూరు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను శుక్రవారం ఎంపీడీఓ జి.రాణి పరిశీలించారు. పోటీలను పీడీలు ఆలీ, సుకుమార్ పర్యవేక్షించారు.